# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# తెలంగాణ రాష్ట్ర కమిటీ

**పత్రికా ప్రకటన**

**జూలై 10, 2019**

**బి.జె.పి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం కశ్మీర్‌కు రాజ్యాంగం కల్పించిన స్వయం ప్రతిపత్తి అధికరణాలైన ఆర్టికల్ 370, 35-ఏ లను రద్దు చేయటాన్ని, కశ్మీర్ రాష్ట్రాన్ని విభజించడాన్ని అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా ఖండించండి.**

**కశ్మీర్ ప్రజలకు అండగా ఉండండి. మద్దతుగా పోరాడండి.**

**ఆగస్టు 15ను "బ్లాక్ డే"గా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాటించండి.**

సంఘ్ పరివార్ బ్రాహ్మణీయ హిందూ మతోన్మాదుల బి.జె.పి ప్రభుత్వం తమ పథకంలో భాగంగానే కొద్ది రోజుల ముందు నుండే ఆర్టికల్స్ 370, 35-ఏ లను రద్దు చేయడానికి ముందు కాశ్మీర్ లోయను దిగ్బంధనం చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా నాయకత్వాన జాతీయ సలహాదారు అజిత్ ధోవల్, హోం శాఖ కార్యదర్శి రాజీవ్ గౌబా ఇతర ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించి ఉగ్రవాదుల దాడి ముప్పు వున్నదనే పేరుతో భారీ స్థాయిలో కశ్మీర్‌లో సైన్యాన్ని మోహరింపజేసి 144 సెక్షన్‌ను అమలుచేస్తూ, ఇంటర్నెట్, కమ్యూనికేషన్స్ బంద్ పెట్టి ప్రజలను బయట ప్రపంచంతో దూరం చేసారు. అమర్‌నాథ్ యాత్రికులను, విద్యాలయాలను మూసివేసి విద్యార్థులను కశ్మీర్ నుండి వెనక్కు పంపడం మొదలు పెట్టారు. మాజీ ముఖ్యమంత్రులు మొహబూబా ముక్తీ, ఒమర్ అబ్దుల్లాలను పోలీసులు గృహ నిర్బంధంలోకి తీసుకున్నారు. దేశవ్యాప్తంగా రెడ్ అలర్ట్‌ను ప్రకటించారు. భారత్ - పాకిస్థాన్ సరిహద్దులో బలగాలను మోహరించారు.

ఆ తర్వాతనే బి.జె.పి మోడీ ప్రభుత్వం కాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే హక్కులు ఆర్టికల్స్ 370, 35-ఏలను రద్దు చేయాలని జమ్మూ-కశ్మీర్‌ను, జమ్మూ-కశ్మీర్, లడక్‌లుగా రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించే తీర్మానాన్ని పార్లమెంట్ (రాజ్యసభ, లోక్‌సభల)లో బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకున్నారు. టిఆర్‌ఎస్, వైఎస్‌ఆర్‌సిపీ, టీడీపీ పార్టీలు కూడా దీనికి మద్దతు తెలిపాయి. తదుపరి రాష్ట్రపతి కూడా ఆమోదం తెలిపారు. ఈ అప్రజాస్వామిక చర్యను ప్రజాస్వామిక వాదులు, ప్రజలు, వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీలు, ముస్లిం ప్రజలు వ్యతిరేకిస్తూ, నిరసనలు తెలియజేస్తున్నారు. ఈ చర్యను పాకిస్థాన్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇతర దేశాలు కూడా వ్యతిరేకించాయి. ఐక్యరాజ్యసమితి చార్టర్, భద్రతాసమితి తీర్మానాల ప్రకారం కశ్మీర్‌లో చట్టాలను మార్చవచ్చును కాని ఏకపక్షంగా భారత ప్రభుత్వంకు ఈ చట్టాల్లో మార్పులు చేసే అధికారం లేదని ఐక్యరాజ్యసమితి తన ప్రకటనలో పేర్కొంది.

నిజానికి ఆర్టికల్ 370, 35-ఏ లను రద్దు చేస్తామని భాజపా 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లోనే తన ఎన్నికల ప్రణాళికలో చేర్చింది. ఇప్పుడు ఆ స్వప్నాన్ని నెరవేర్చుకుంటున్నారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినాన మోడీ త్రివర్ణ పతాకాన్ని ఢిల్లీ ఎర్రకోటలో కాకుండా కశ్మీర్‌లో ఎగురవేయబోతున్నాడు. ఇదే రోజున దేశంలో గ్రామ గ్రామాన త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని భాజపా భావిస్తోంది.

భారత ప్రజలను ప్రధానమంత్రి మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఆర్టికల్స్ 370, 35-ఏ లను రద్దు చేయడం ద్వారా కశ్మీర్‌లో నూతన యుగం ప్రారంభమవుతుందని, అక్కడ అభివృద్ధికి మార్గం సుగుమం అవుతుందని మాట్లాడారు. బీజేపీ తన చర్యను ఇలా సమర్థించుకుంటుంది. ఈ ఆర్టికల్‌ను ఉపయోగించుకొని అక్కడి పార్టీలు పిడిపి, ఎన్‌సిపిలు అధికారాన్ని చెలాయించడంతో పాటు అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ నిధులు స్వాహచేసి వారు, వారి కుటుంబాలు బాగుపడుతున్నాయి. కానీ పేద ప్రజలకు ఎలాంటి న్యాయం కలగడం లేదని, లడక్‌ను నిర్లక్ష్యం చేశారని, ముఖ్యంగా అక్కడి ప్రజలకు ఉపయోగపడే ఢిల్లీ చట్టాలు అన్నీ అక్కడ అమలుకావు అనే కారణాలు చూపుతున్నారు. 1947 ఆర్టికల్ 370, 35-ఏ ద్వారా కశ్మీరీలు మేము వేరు, మాకు స్వయం ప్రతిపత్తి హోదా వుంది. అనే భావన వారిలో పెరిగింది. అలా వారు భారత్‌లో కశ్మీర్ అంతర్భాగం అనేదానికి విరుద్దంగా పాకిస్థాన్‌కు దగ్గర చేస్తున్నదని. అదే నేడు 'ఆజాదీ కశ్మీర్' అనే భావనకు దారితీసింది. బీజేపీ ప్రభుత్వము దాని వందిమాగదులు లేవనెత్తుతున్న ఈ వాదన పచ్చి బూటకం. వీరు చరిత్రకు మసి బూసి మారేడు కాయచేసే వాదనలు ముందుకు తెచ్చి భారత ప్రజలను కశ్మీరీల ఆజాదీకి వ్యతిరేకంగా రెచ్చగొడుతున్నారు. ప్రధానంగా కాశ్మీర్‌లో ముస్లింలు గల మెజారిటీ ప్రాంతాన్ని హిందువుల బస్తీలతో నింపి వారిని అణచివేయడం, అక్కడ కూడా హిందూ ఓటు బ్యాంకును సుస్థిరం చేసుకొని హిందూ రాష్ట్ర నిర్మాణాన్ని ముందుకు తీసుకపోవడం వారి ప్రధాన లక్ష్యం. ఈ చట్టాన్ని రద్దుచేయడం ద్వారా అక్కడ పెట్టుబడులు వచ్చి పరిశ్రమలు ఏర్పడి ఉద్యోగాలు, అభివృద్ధి జరుగుతుందనేది కూడా వట్టి బూటకం. మన దేశంలోనే జరగని అభివృద్ధి జమ్మూ-కశ్మీర్‌లో చేస్తామనడం హాస్యాస్పదం.

వాస్తవాలు ఏమంటే ఈరోజు ఆజాది కోసం పోరాడుతున్న కశ్మీర్‌ను 1947 అక్టోబర్ 26న బలవంతంగా భారత్ యూనియన్‌లో విలీనం చేశారు. ఇంకా ఈ విలీనం విధి విధానాలు అప్పటికింకా పూర్తి కాలేదు. వీటిపై 1949 జూలైలో నేషనల్ కాన్ఫరెన్స్ అగ్రనేత షేక్ అబ్దుల్లా భారత ప్రభుత్వంతో చర్చలు ప్రారంభించాడు. పర్యావసానంగా కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని రాజ్యాంగంలో చేర్చారు. దీని ప్రకారం రక్షణ, ఆర్థిక, కమ్యూనికేషన్ వ్యవహారాలు తప్ప మిగత వాటిలో కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి వుంటుంది. ఈ రాష్ట్రంలో ఇతర చట్టాల్ని అమలు చేయాలంటే రాష్ట్ర సమ్మతిని పార్లమెంట్ తీసుకోవాల్సి వుంటుంది. పౌరసత్వం, ఆస్తిహక్కు, ప్రాథమిక హక్కుల విషయంలో రాష్ట్ర ప్రజలకు ప్రత్యేక చట్టాలు వుంటాయి. అందువల్ల ఏ ఇతర రాష్ట్రాల వారు భూముల్ని కొనలేరు. ఆర్టికల్ 360 కింద ఈ రాష్ట్రంలో కేంద్రం ఆర్థిక ఎమర్జెన్సీని విధించలేదు. ఆర్టికల్ 35-ఏ జమ్మూ-కశ్మీర్ ప్రజలకు ప్రత్యేక హక్కులు కల్పిస్తుంది. నివాస, స్థిరాస్థి హక్కుల్ని కల్గిస్తుంది. కశ్మీరి నివాసి అంటే 1954 మే 14వ తేదీ కన్నా ముందు లేదా ఆ తేదీ నాటికి రాష్ట్రంలో జన్మించిన వ్యక్తి లేదా పదేళ్ళపాటు రాష్ట్రంలో నివసించిన వ్యక్తి కశ్మీర్ శాశ్వత నివాసి అవుతాడు. ఆ వ్యక్తి రాష్ట్రంలో స్థిరాస్తుల్ని కల్గి వుండవచ్చు. కశ్మీరేతరుడు రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నిక కాకూడదని 1956 నవంబర్ 17వ తేదినా ఆమోదించిన రాష్ట్ర రాజ్యాంగం చెబుతుంది. ఇవన్నీ సంఘ్ పరివార్ హిందూ రాజ్యానికి ప్రతిబంధకాలు. బి.జె.పి తమకున్న మెజారిటి బలంతో వీటన్నింటిని తొలగించడానికి ఈ చర్యకు ఉపక్రమించింది.

అసలు ప్రజాధారణ లేని సంఘ్ పరివార్ శక్తులు 90 దశకంలో రామమందిరం నినాదంతో కొంత బలం పుంజుకొని 2014లో సంపూర్ణ మెజారిటితో అధికారంలోకి వచ్చాయి. మొదటి నుంచి బ్రాహ్మణీయ హిందూ మతోన్మాదులు మైనార్టీ మతాల, మూలవాసుల, జాతుల సంస్కృతిని, భిన్నత్వాన్ని ఆమోదించకుండా శతృవు భావాన్ని కల్గివున్నారు. అందుకే మన దేశంలో వేల సంవత్సరాలుగా సహజీవనం చేస్తున్నా మైనార్టీ మతాల ప్రజలలో భయాందోళనలు కల్గిస్తున్నారు. పౌర ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నారు.

భారతదేశం బహుళజాతులు, బహుళ భాషలు, అనేక సంస్కృతులు గల దేశం. ఈ జాతులను అభివృద్ధి చెందకుండా భారత దళారీ పాలక వర్గాలు సామ్రాజ్యవాదులకు ఊడిగం చేస్తూ, జాతులను దోపిడీ చేస్తూ ఐక్యత, సమగ్రత పేరుతో దేశాన్ని జాతుల బంధీఖానగా మార్చివేశారు. ఈ అణచివేతకు వ్యతిరేకంగా విడిపోయే హక్కుతో సహా స్వయం నిర్ణయాధికారం కోసం పోరాడుతున్నాయి. అందుకే మా పార్టీ జాతుల న్యాయమైన పోరాటాన్ని సమర్థిస్తున్నది. విడిపోయే హక్కును గుర్తిస్తున్నది. స్వయం ప్రతిపత్తి కోసం న్యాయమైన పోరాటం కొనసాగిస్తున్న కశ్మీర్ ప్రజలకు మావోయిస్టు పార్టీ పూర్తి మద్ధతు తెలియజేస్తున్నది. జమ్మూ-కశ్మీర్‌లో ఆర్టికల్ 370, 35-ఏ లను రద్దు చేయడాన్ని మా పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది.

**జమ్మూ-కశ్మీర్‌లో 370, 35-ఏ ఆర్టికల్‌లను రద్దుచేసిన వెంటనే తెలంగాణలో బి.జె.పి, టిఆర్ఎస్ పార్టీలు, వాళ్ళ ఎమ్ఎల్ఏలు, ఎంపీలు సంబరాలు జరుపుకోవడాన్ని వ్యతిరేకించండి.**

**ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మైనార్టీలు, దళితులు, ఆదివాసులు, అన్ని సెక్షన్ల ప్రజలు, వామపక్షాలు, బి.జె.పికి వ్యతిరేకంగా కలిసి వచ్చే ప్రతి సంస్థలు, వ్యక్తులు, శక్తులు పార్లమెంట్‌లో ఆమోదించి రద్దు చేసిన ఆర్టికల్స్ 370, 35-ఏ లను పునరుద్ధరించే వరకు మిలిటెంట్‌గా పోరాడాలని పిలుపునిస్తున్నాం.**

**370, 35-ఏ రద్దుకు నిరసనగా ఆగస్టు 15ను తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా "బ్లాక్ డే"గా పాటించాలని పిలుపునిస్తున్నాం.**

**విప్లవాభినందనాలతో,**

జగన్,

అధికార ప్రతినిధి,

తెలంగాణ రాష్ట్ర కమిటీ,

సీపీఐ (మావోయిస్టు).